క్లుప్తంగా

అంగన్‌వాడీ విద్యార్థులకు వైద్యపరీక్షలు



అమరచింత: ప్రభుత్వ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకుంటున్న చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేస్తున్నామని డాక్టర్ నిస్సార్ అహ్మద్ తెలిపారు. పట్టణంలోని ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. చిన్నారుల్లో అధికంగా కడుపునొప్పి, తామర, రక్తహీనత వంటివి వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. వీటి కోసం ఏ విటమిన్ సిరప్‌ను అందించాలన్నారు. వాంతులు విరేచనాలు అయితే సమీపంలోని పీహెచ్‌సీకి వెళ్లి వైద్య సేవలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాధిక, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోపాటు మెరుగైన విద్య

తెలకపల్లి: చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారంతోపాటు మెరుగైన విద్య అందిస్తున్నారని పంచాయతీ ఈఓ భాస్కర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీస్కూల్ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఈఓ హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని సౌకర్యాల ద్వారా విద్యార్థులను మంచి ప్రవర్తనతో విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు క్రమం తప్పకుండ తమ చిన్నారులను కేంద్రాలకు పంపించాలని సూచించారు. అనంతరం చిన్నారులకు ప్రోగ్రేస్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ చంద్రకళ, పుష్పమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఇంటింటా కాంగ్రెస్ ప్రచారం



మదనాపురం: పేదల పక్షాన కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు ఉంటుందని పార్లమెంటు ఎన్నికల్లో మహబూబ్‌నగర్ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచందర్ రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలు ఇంటింటా ప్రచారం చేశారు. శనివారం నర్సింగాపురం, మదనాపురం, రామన్‌పాడు, అజ్జకొల్లు తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. దుప్పల్లిలో ఆంజనేయ స్వామి, పోచమ్మ తల్లి, పెద్దమ్మ తల్లి, ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వడదెబ్బకు నాలుగు లేగదూడలు మృతి



పెంట్లవెల్లి: విపరీతమైన ఎండలు ఉండడంతో మండలంలోని సింగవరంలో తెలుగు వెంకటయ్య పాడి రైతుకు చెందిన నాలుగు లేగదూడలు శుక్రవారం రాత్రి మృతి చెందాయి. ఉదయం లేగదూడలను చనిపోవడం చూసి ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి పశువులను తెచ్చుకుంటే ఒకేసారి నాలుగు దూడలు చనిపోవడం ఎంతో బాధగా ఉందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. లేగదూడలను స్థానిక పశు వైద్య సిబ్బంది పరీక్షించారు.

మగ్దుంపూర్ దర్గా విజయోత్సవాలు



లింగాల: మండలంలోని మగ్దుంపూర్ దర్గా ఎంతో మహిమగలదని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం దర్గాలో నిర్వహించి మగ్దూం శావాలి విజయోత్సవాలలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలకతీతంగా ప్రజలు దర్గాకు వచ్చి పూజలు చేయడం చాలా గొప్ప విషయమని అన్నారు. దర్గాపై ప్రజలు ప్రగాఢ విశ్వాసం ఉంచుకొని మొక్కులు చెల్లించుకుంటున్నట్లు తెలిపారు. దర్గా దినదినాభివృద్ధి చెందుతుందని, దర్గా అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో షఫీ, బారీ, ముక్తార్, కొండల్‌రావు, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల

కోడేరు: లోక్‌సభ ఎన్నికల్లో మల్లు రవిని గెలిపించాలని శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాము ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

జెర్సీ ఆవులతో లాభాలపంట

- స్వయం ఉపాధి పొందుతున్న పాడి రైతులు
- లాభాలు ఆర్జిస్తున్న జెర్సీ క్రాస్‌బ్రీడ్ ఆవుల రైతులు
- సబ్సిడీ రుణాలు అందించాలని వేడుకోలు



చాకల్‌పల్లిలో మిషన్ల ద్వారా పాలు పితుకుతున్న రైతు

గోపాల్‌పేట: పాడిపశువుల పెంపకంతో మండలంలోని చాకల్‌పల్లి గ్రామ రైతులు, కొందరు యువకులు లాభాలు ఆర్జిస్తున్నారు. పశువుల డాక్టర్ సూచనతో కొందరు యువకులు, రైతులు 2011 సంవత్సరంలో పాడి పెంపకాన్ని ప్రారంభించారు. మొదట కొన్ని జెర్సీ హెచ్–7 క్రాస్‌బ్రీడ్ ఆవులతో ప్రారంభమైన పెంపకం నేడు 300 ఆవుల వరకు పెరిగింది. ప్రస్తుతం నెలకు లక్ష లీటర్ల వరకు పాల దిగుబడి సాధిస్తున్నారు.

30 మందికి పైగా..

మండలంలోని చాకల్‌పల్లికి చెందిన యువకులు, కొలు రైతులు ప్రభుత్వ పశువుల డాక్టర్ సలహాతో స్వయం ఉపాధిని ఎంచుకున్నారు. 2011లో గోపాల్‌పేట ప్రభుత్వ పశువుల డాక్టర్ దేవ్యానాయక్ సలహాతో గ్రామానికి చెందిన లంకా రమేష్ రెడ్డి సబ్సిడీపై కర్ణాటక నుంచి మూడు జెర్సీఆవులు కొనుగోలు చేశాడు. ఆ తర్వాత మరో వ్యక్తి యాదయ్య మూడు ఆవులను కర్ణాటక నుంచి కొనుగోలు చేశాడు. ఇప్పటి వరకు 30 మందికి పైగా జెర్సీ ఆవులు కొని స్వయం ఉపాధి పొందుతున్నారు.

మూడు ఆవులతో ప్రారంభమై..

మొదట మూడు ఆవులతో ప్రారంభమైన పాడి వ్యాపారం నేడు 300 ఆవుల వరకు పెరిగింది. జెర్సీ ఆవులతో రోజుకు మూడు నుంచి నాలుగు వందల లీటర్ల వరకు పాలను పలు ప్రైవేటు సంస్థలకు మూడు పాల కేంద్రాల ద్వారా అమ్ముకుంటున్నారు. నెలకు దాణాకు, పచ్చిగడ్డి పెంపకానికి ఇతర ఖర్చులకు నెలకు రూ.15 వేలు పోగా.. ఒక్కో పాడి రైతుకు నెలకు రూ.30,000 వరకు మిగులుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఎంత ఓపికతో పనిచేసి వాటికి గడ్డి, దాణ పెట్టి బాగుగా చూసుకుంటే అంత ఎక్కువ పాల దిగుబడి వస్తుందని చెబుతున్నారు. ప్రభుత్వం గతంలో పాడి రైతులకు సబ్సిడీపై మందులు, దాణా ఇస్తే బాగుంటుందని ఎక్కువ మొత్తంలో పశువుల మందులు, దాణాకే పోతోందని, ప్రభుత్వం సాయం అందిస్తే మరింత మంది ఆవుల ద్వారా ఉపాధి పొందేందుకు అవకాశం ఉంటుందని చాకల్‌పల్లి రైతులు చెబుతున్నారు. మొదట చాకల్‌పల్లిలో ప్రారంభమైన జెర్సీ ఆవుల పెంపకం ప్రస్తుతం పాలికెపాడు, మున్ననూరు, తిర్మలాపూర్, గోపాల్‌పేట ప్రాంతాల్లో రైతులు ఉపాధి పొందుతున్నట్లు వెటర్నరీ డాక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

మూడు ఆవులతో ప్రారంభించాను..



2012 సంవత్సరంలో మూడు జెర్సీ ఆవులు తీసుకొచ్చాం. ఇప్పుడు మా అన్న నేను కలిసి వ్యాపారం చేస్తున్నాం. ఎవరైనా సరే ఇందులో ఎంత కష్టపడి పనిచేస్తే అంత లాభం ఉంటుంది. ప్రభుత్వం మాకు ఆవుల మందులు, దాణాకు సాయం అందిస్తే బాగుంటుంది.

– యాదయ్య, చాకల్‌పల్లి

పాల దిగుబడికి జెర్సీఆవులు మేలు..

కేవలం పాల ఉత్పత్తి కోసం అయితే జెర్సీ హెచ్ఎఫ్ క్రాస్‌బ్రీడ్ ఆవులు బాగుంటాయి. మొదట చాకల్‌పల్లిలో ఎక్కువగా పెంచే వారు. ప్రస్తుతం పాలికెపాడు, మున్ననూరు, తిర్మలాపూర్, గోపాల్‌పేట, కేశంపేట కొత్తతండా, పాతతండాలో సైతం పెంచుతున్నారు. మండలంలో ప్రస్తుతం 500 ఆవుల వరకు ఉంటాయి.

– ఉదయ్‌కుమార్‌రెడ్డి, వెటర్నరీ డాక్టర్, గోపాల్‌పేట

బండలాగుడు పోటీలు ప్రారంభం



గోపాల్‌పేటలో బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని కోదండ రామస్వామి ఆలయం వద్ద శనివారం సీనియర్ సైజ్ బండలాగుడు పోటీలను వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన గురువారం, శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి బండలాగు పోటీల్లో ప్రతిభ కనబర్చిన వాటికి బహుమతి అందించారు. ఆయన వెంట సత్యశీలారెడ్డి, స్థానిక నాయకులు శివన్న, శ్రీనివాసులు, వెంకటయ్య, శివ, ముఖ్య నాయకులు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న మునిరంగా స్వామి జాతర

అమరచింత: మండలంలోని నందిమళ్లలో వెలిసిన చింతల మునిరంగా స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం బండలాగుడు పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తొమ్మిది జతల ఎడ్లు పాల్గొనగా పోటీలను టీపీసీసీ కల్లుగీత సంఘం రాష్ట్ర నాయకులు కేశం నాగరాజ్‌గౌడ్ ప్రారంభించారు. మొదటి బహుమతిని సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డికి చెందిన ఎద్దులు సాధించగా.. బహుమతిగా రూ.50 వేల నగదు అందుకున్నారు. రెండో బహుమతిని ఉమారెడ్డిశ్రీవల్లి ప్రకాశం జిల్లాకు చెందిన ఎద్దులు సాధించి రూ.40 వేల నగదు, మూడో బహుమతిని కుర్వకర్రెప్ప గొర్లకాన్ దొడ్డి, గద్వాల జిల్లా వాసి ఎద్దులు సాధించి రూ.30 వేల నగదును బహుమతిని అందుకున్నారు. అదే విధంగా నాలుగో బహుమతిని సుబ్రహ్మణేశ్వర రెడ్డికి చెందిన ఎద్దులు సాధించి రూ.20 వేల నగదు, ఐదో బహుమతిని గద్వాల జిల్లా గార్లపాడ్‌కు చెందిన రామాంజనేయులుకు చెందిన ఎద్దులు సాధించి రూ.10 వేల నగదు బహుమతులు అందుకున్నారు. విజేతలకు నగదు బహుమతులను స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సొంతంగా అందించారని నిర్వాహకులు తెలియజేశారు.



నందిమళ్లలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న నాగరాజ్ గౌడ్

విఘ్నేశ్వరుడికి పంచామృతాభిషేకం



కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో విఘ్నేశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తకోట రూరల్: మండల పరిధిలోని కానాయపల్లి స్టేజీ సమీపంలోని శ్రీదత్త కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం సంకటహర చతుర్థి సందర్భంగా మహాగణపతికి పంచామృతాలతో ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. చతుర్థి రోజున గణపతికి భక్తిశ్రద్ధలతో అభిషేకం చేస్తే కష్టాలు తొలగిపోతాయి సుఖసంతోషాలతో ఉండేలా భగవంతుడు చూస్తాడని భక్తుల నమ్మకం. ఆలయంలోని విఘ్నేశ్వరుడికి జరుగుతున్న పంచామృతాభిషేకంలో పాల్గొనేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పూజా కార్యక్రమం అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పచ్చిరొట్ట విత్తనాలు విత్తుకోండి

పెద్దకొత్తపల్లి: ఆయిల్‌పాం తోటలు పెంచుతున్న రైతులు వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మొక్కల చుట్టు కుదుర్లపై పచ్చిరొట్ట, జనుము విత్తనాలు విత్తుకోవడం వలన పాదులలో తేమశాతాన్ని కాపాడుతుందని కొల్లాపూర్ హార్టికల్చర్ అధికారి లక్ష్మణ్ తెలిపారు. వేసవిలో వచ్చే వేడి గాలుల వలన మొక్కను కాపాడుతుంది. జనుము పూతకు వచ్చాక దానిని ముక్కలు ముక్కలుగా చేసి పామ్‌ఆయిల్ మొక్క పాదుచుట్టు వేసుకోవాలన్నారు. ఇలా చేయడం వలన సేంద్రియ ఎరువుగా మారుతుందని తెలిపారు. అదేవిధంగా చెట్లకు ప్రతి రోజు డ్రిప్ ద్వారా నీరు అందించాలని సూచించారు.

వద్దన్న వారిని.. ఎలా చేర్చుకుంటారు!

- వనపర్తి పాలిటెక్నిక్ కళాశాలలో సమావేశమైన కాశీంనగర్ ఎర్రగట్టుతండా నాయకులు



ఎమ్మెల్యే తీరు సరికాదని సమావేశంలో వాగ్వాదం చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తిటౌన్: ఇతర పార్టీల నాయకులను పార్టీలో చేర్చుకోమని, ఎవరైనా.. చేర్చుకుంటే సరికాదని చెప్పిన ఎమ్మెల్యే మేఘారెడ్డి, మళ్లీ ఇతర పార్టీల నాయకులను ఎలా చేర్చుకుంటారని ఎర్రగట్టు తండా కాంగ్రెస్ నాయకులు ప్రశ్నించారు. వనపర్తి మండలంలోని కాంశీనగర్ సమీపంలోని ఎర్రగట్టు తండాకు చెందిన పాత కాంగ్రెస్ నాయకులు శనివారం చేరికలను వ్యతిరేకిస్తూ.. వనపర్తి పాలిటెక్నిక్ కళాశాలలో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే తీరు సరికాదంటూ, చేరికలను వెనక్కి తీసుకోకుంటే నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. చేరికలను వెనక్కి తీసుకోకుంటే త్వరలో వచ్చే లోకల్ బాడీ ఎన్నికల్లో గొడవలు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలంగా తమకు సమాచారం ఇవ్వకుండా ఎలా పార్టీలో చేర్చుకుంటారని ప్రశ్నించారు. ఇన్నాళ్లు ప్రతిపక్షంలో ఉంటూ అధికార పార్టీ ఎన్ని ఇబ్బందులకు గురిచేసిన తట్టుకొని నిలబడ్డామని వాపోయారు. దశాబ్దాల తరబడి పనిచేస్తున్న మమ్మల్ని ఇబ్బందులకు గురిచేసి నానా అవస్థలు పెట్టిన బీఆర్ఎస్ నాయకులను చేర్చుకోవద్దన్నారు. ఆదివారంలోగా చేరికలను ఉపసంహరించుకోకుంటే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెబ్బేరు రూరల్: మండల కేంద్రానికి చెందిన పూజారి నంబి కృష్ణయ్య శుక్రవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి శనివారం పెబ్బేరు పట్టణ కేంద్రంలోని వారి స్వగృహంలో మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రీనివాసులుగౌడ్, వెంకటేష్, సురేందర్‌గౌడ్, చీర్ల శేఖర్, రఘుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



వీపనగండ్ల: మండలంలోని సంగినేనిపల్లిలో అనారోగ్యంతో మృతిచెందిన మైశారం బాలయ్య కుటుంబానికి రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో వారి అనుచరులు శనివారం బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. అదే విధంగా గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న వార్డు సభ్యులు మీసాల రాజుకు మరో రూ.5 వేలను అందజేశారు. జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఇంద్రకంటి వెంకటేష్, దివ్యాంగుల సంఘం రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు మీసాల మోహన్, కురుమయ్య, గోవుల నాగరాజు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నాగసానిపల్లికి చెందిన సామెల్

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపూర్ మండలంలోని నాగసానిపల్లికి చెందిన సామెల్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ స్థానిక నాయకులతో కలసి శనివారం గ్రామంలో మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి పంపిన ఆర్థికసాయం రూ.5 వేలను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాములుయాదవ్, నాయకులు రాములు, బహుజన రమేష్, ఈశ్వరయ్య, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజల గొంతుక బీఆర్ఎస్

నాగర్‌కర్నూల్: తెలంగాణ ప్రజల ఏకైక గొంతుక బీఆర్ఎస్ పార్టీ అని జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పార్టీ కార్యాలయంలో ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలవేసి, అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ పునర్నిర్మాణం కోసమే బీఆర్ఎస్ పుట్టిందన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిచేసి, ప్రపంచ పటంలో నిలిపిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. వ్యవసాయ రంగంలో 2కోట్ల 50లక్షల మంది ఉపాధి పొందారని.. ఐటీ రంగంలో 6లక్షల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. 24గంటల కరెంటుతో పారిశ్రామిక రంగం ప్రగతి సాధించిందని వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ నాయకత్వాన్ని బలపర్చాలని కోరారు.



ప్రతి ఓటరుకు ఓటర్ స్లిప్‌లు అందించాలి



బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సుభాష్‌నాయుడు

పాన్‌గల్: ఓటు హక్కు ఉన్న ప్రతి ఓటరుకు ఓటరు స్లిప్‌లు అందించాలని తహసీల్దార్ సుభాష్‌నాయుడు బీఎల్‌ఓలకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఓటర్ స్లిప్‌ల పంపిణీపై బీఎల్‌ఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని 28 గ్రామపంచాయతీల్లో మొత్తం 44 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటి పరిధిలో 41,469 మంది ఓటర్లు ఉన్నారన్నారు. బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి ప్రతి ఓటరుకు ఓటరు స్లిప్‌లను అందించాలన్నారు. ఓటరు స్లిప్‌ల పంపిణీలో నిర్లక్ష్యం వహించే బీఎల్‌ఓలపై శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో డీటీ అశోక్‌కుమార్, ఆర్ఐ మహేష్, సిబ్బంది, వివిధ గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సోషల్ వర్కర్ నరేందర్

పాన్‌గల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ నరేందర్ అన్నారు. శనివారం మండలంలోని చింతకుంటలో మహిళ శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలకు బాల్యవివాహాల నిరోధం, బాలల పరిరక్షణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆడ పిల్లలను మగపిల్లలతో సమానంగా చదివించాలని, బాలల హక్కులను కాపాడాలన్నారు. బాలల రక్షణ చట్టాలు, బాలల హక్కులు, బాలల అక్రమ రవాణా, బాల్య వివాహాల నిషేధ చట్టం 2016, బాలలపై లైగింక వేధింపుల నిరోధ చట్టం 2012, బాల కార్మిక నిషేధ చట్టం 2016, యువతపై మాదక ద్రవ్యాల ప్రభావం, మహిళలపై లైగింక వేధింపుల నిరోధం, బాలల పరిరక్షణ విభాగం అందిస్తున్న సేవలు, చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్లు 1098, 112, 100పై అవగాహన కల్పించారు. వేసవి కాలంలో ఈతకు వెళ్లే పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ బీరయ్య, మహిళ సంఘం సభ్యులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి



బొల్లారంలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

వీపనగండ్ల: రైతులు పండించిన వరిధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వంక గోపాల్ డిమాండ్ చేశారు. శనివారం బొల్లారంలో వరి కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. రైతులు పది రోజులుగా ధాన్యాన్ని ఎండబెట్టినా.. తేమశాతం పేరుతో ధాన్యాన్ని కొనుగోలు చేయడంలేదని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులైన నీడ, నీళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రాథమిక చికిత్సకు అవసరమైన మెడికల్ కిట్లు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. విక్రయించిన ధాన్యానికి కూడా డబ్బులు సక్రమంగా రైతు ఖాతాలో జమకావడంలేదని అన్నారు. ఉన్నతాధికారులు స్పందించి రైతుల సమస్యలను పరిష్కరించకుంటే ధర్నా కార్యక్రమాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. చల్మారెడ్డి, కురుమయ్య, గోవింద్, నర్సింహ పాల్గొన్నారు.

రక్తదానానికి దాతలు ముందుకు రావాలి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న నీలగిరి శాలిమఠం పీఠాధిపతి సుగురేశ్వర స్వామి

అమరచింత: ప్రమాదకర పరిస్థితుల్లో రక్తం లేక కొన ఊపిరితో ఉన్నవారికి దాతలు ఇచ్చిన రక్తం సంజీవణిగా మారి వారి ప్రాణం కాపాడుతుందని నీలగిరి శాలిమఠం పీఠాధిపతి సుగురేశ్వర స్వామి అన్నారు. పట్టణానికి చెందిన శబరినాథ్ గౌడ్, అక్షయ జ్ఞాపకార్థం శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. దానం చేయడం మనిషి ధర్మమని, కొందరు ఆకలితో ఉన్నవారికి ఆహారం అందిస్తారని, మరికొందరు ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్నవారికి తమ రక్తం దానంగా ఇచ్చి ఆదుకుంటారని, అలాంటి వ్యక్తులు మనుషుల్లో దేవుళ్లలాంటి వారన్నారు. పాలమూర్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో సుమారు 50 మంది యువకులు పాల్గొని రక్తం దానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్ కుమార్, టీపీసీసీ గీతకార్మిక డిపార్ట్‌మెంట్ రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్, శ్రీలన్‌గౌడ్, గురుస్వామి గోపాలకృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్త శ్రమించాలి



కంచిరావుపల్లి తండాలో కమలంపువ్వు గుర్తుకు ఓటు వేయాలని చూపిస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ గెలుపునకు ప్రతి కార్యకర్త శ్రమించాలని బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకట్రామరెడ్డి సూచించారు. ఆయన శనివారం మండలంలోని కంచిరావుపల్లి తండాలో ఇంటింటిరీ తిరుగుతూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థికి మద్దతుగా నిలిచి కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. వనపర్తి మండలంలోని కడుకుంట్లలో బీజేపీ నాయకులు పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా ఇంటింటికీ తిరుగుతూ కమలం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. నారాయణ, సంద వెంకటేష్, నాగరాజుయాదవ్, సుదర్శన్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ ఎరువులు అందిస్తుంది మోదీనే..

ఖిల్లాఘనపురం: దేశంలోని ప్రతి రైతుకు సబ్సిడీపై ఎరువులు అందిస్తుంది నరేంద్ర మోడీ ప్రభుత్వమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పర్వతాపురంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ఆయన కూలీలతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని పేద ప్రజల కోసమే నిర్వహిస్తుందన్నారు. గతంలో రూ.100 ఇచ్చే కూలీని నేడు రూ.300లకు పెంచిందన్నారు. ఎప్పటికప్పుడు రైతులు పండించే పంటలకు మద్దతు ధరలను పెంచడం జరుగుతుందన్నారు. నరేంద్ర మోడీ ఆశీర్వాదంతో పార్లమెంటు స్థానంలో భరత్ ప్రసాద్‌ను బీజేపీ అభ్యర్థిగా నిలపడం జరిగిందన్నారు. ప్రజలంతా ఆశీర్వదించి మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్, జిల్లా పంచాయతీ రాజ్ సెల్ కన్వీనర్ విక్రం, ప్రధాన కార్యదర్శులు శివశంకర్, సత్యనారాయణ, గోపి, గోపాల్ రెడ్డి, వెంకట్‌రమణ తదితరులు పాల్గొన్నారు.

పోరుబాట సభకు తరలిన నాయకులు



బుసిరెడ్డిపల్లి నుంచి తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు



వీపనగండ్ల నుంచి వెళ్తున్న నాయకులు

పాన్‌గల్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ సీఎం కేసీఆర్ 'పోరుబాట' బస్సు యాత్ర శనివారం నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన సభకు ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మి, వైస్ ఎంపీపీ కవిత ఆధ్వర్యంలో పార్టీ నాయకులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు.

వీపనగండ్ల: బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ.. శనివారం నాగర్‌కర్నూల్ పట్టణంలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ సమావేశానికి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి పలువురు నాయకులు బయలుదేరి వెళ్లారు. ముంతమల్లయ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

ఖిల్లాఘనపురం: నాగర్‌కర్నూల్‌లో చేపట్టిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొనేందుకు మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ.. చేపట్టిన సభకు ఎంపీపీ కృష్ణానాయక్, అశోక్, రాళ్లకృష్ణయ్య, సామ్యానాయక్ తదితరుల ఆధ్వర్యంలో ఖిల్లాఘనపురంతో పాటుగా, అప్పారెడ్డిపల్లి, ఆగారం, సల్కెలాపురం తదితర గ్రామాల నుంచి వెళ్లారు.

నిబంధనలు పాటించాలి

తాడూరు: మండలంలోని పొల్మూరును అనుసరించుకుని ఉన్న దుందుబి నది నుంచి ఇసుక తరలింపు నిబంధనల మేరకే కొనసాగాలని తహసీల్దార్ ప్రమీళ శనివారం ప్రకటనలో తెలిపారు. సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందని తెలిపారు.